

ఫ్లెక్సీలు కడితే జరిమానా విధిస్తాం..: కమిషనర్

కోల్‌సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌లోని ప్రధానరహదారుల వెంట ఉన్న సెంట్రల్‌లైటింగ్ పోల్స్‌కు ఫ్లెక్సీలు కడితే జరిమానా విధిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీ హెచ్చరించారు. కొంతమంది ఫ్లెక్సీ ప్రింటింగ్ ఏజెన్సీలు అనుమతి లేకుండా పోల్స్‌పై ఫ్లెక్సీలు కట్టడంతో వాహనాల రాకపోకలకు అడ్డంకులు ఏర్పడుతున్నాయని అన్నారు. ప్రభుత్వ ఆస్తికినష్టం వాటిల్లుతుందని, ఫ్లెక్సీలు ఏర్పాటుచేస్తే వాటిని తొలగించడంతో పాటు సంబంధిత ఏజెన్సీలకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

2నుంచి ఇన్‌స్పైర్ జిల్లాస్థాయి పోటీలు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి బాలల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్‌అవార్డు మనాక్ జంటఎగ్జిబిషన్‌లను డిసెంబర్2 నుంచి రామగుండం ఎన్టీపీసీలోని ఉన్నతపాఠశాలలో జరగనున్నట్లు జిల్లా విద్యాధికారి శారద తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి జూనియర్ విభాగంలో 6నుంచి8 తరగతుల విద్యార్థులు, సీనియర్‌విభాగంలో 9నుంచి 12తరగతి విద్యార్థులు సమాజహిత, వినూత్న ప్రాజెక్టులతో హాజరుకావాలని ఆమె తెలిపారు. మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, గైడ్‌టీచర్లు తమపాఠశాల విద్యార్థులను ప్రోత్సహించి నాణ్యమైన ఆవిష్కరణలతో పాల్గొనాలన్నారు. ఇన్‌స్పైర్ అవార్డులకు ఎంపికైన ప్రతివిద్యార్థి తప్పకుండా ఈ మూడు రోజులు వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సుస్థిర వ్యవసాయం, వ్యర్థపదార్థాల నిర్వహణ, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలు, గ్రీన్ ఎనర్జీ, అభివృద్ధి చెందుతున్న సాంకేతికత వినోదభరితమైన గణిత నమూనాలు, ఆరోగ్యం, పరిశుభ్రత, నీటి సంరక్షణ నిర్వహణ ఉపఅంశాల్లో విద్యార్థులు తమ ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించాలని తెలిపారు.

జాబ్‌మేళాకు అపూర్వ స్పందన

పెద్దపల్లి కల్చరల్/టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): యాదవ చారిటబుల్ ట్రస్టు తన9వ వార్షికోత్సవం పురస్కరించుకుని పెద్దపల్లిలో నిర్వహించిన మెగాజాబ్ మేళాకు అపూర్వ స్పందన లభించిందని ట్రస్టు జిల్లా అధ్యక్షుడు మారం తిరుపతి యాదవ్. నిరుద్యోగుల కోసం ట్రస్టు ప్రతి నాలుగు నెలకోసారి వివిధశాఖలకు సంబంధించిన ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలు కంపెనీల నిర్వాహకులు, ట్రస్టు నాయకులు పాల్గొన్నారు.

ఆస్పత్రులను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

పెద్దపల్లిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న ఆస్పత్రుల్లో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వాణిశ్రీ తనిఖీ చేపట్టారు. పట్టణంలో రెన్యూవల్, రిజిస్ట్రేషన్ కొరకు దరఖాస్తు చేసుకున్న ఆస్పత్రుల్లో రికార్డ్స్ రిపోర్ట్, కేసు షీట్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బయో మెడికల్ వేస్టేజ్ మేనేజ్‌మెంట్ రూల్స్ ప్రకారం నిర్వహించాలన్నారు. రిజిస్ట్రేషన్‌లో నమోదు అయిన ప్రకారం బెడ్ స్ట్రెంత్ ఉండాలన్నారు. సరిపోయే స్టాఫ్ ఉండక, నిబంధనలకు విరుద్ధంగా నడిచే వాటి పైన చర్యలు తీసుకుంటామన్నారు. టారిఫ్ బోర్డులోని ధరల ప్రకారం ఫీజు తీసుకోవాలని సూచించారు. రెన్యువల్ తేదికి 3నెలల ముందే దరఖాస్తు సమర్పించాలన్నారు.

శబరిమలకు ఆర్టీసీ బస్సులు: డీఎం


కాల్వశ్రీరాంపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యప్ప స్వాములు మాలవిరమణకు శబరిమలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశామని వీటిని సద్వినియోగం చేసుకోవాలని శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోదావరిఖని ఆర్టీసీ డిపో మేనేజర్ నాగభూషణం తెలిపారు. బస్సుల్లో ఆడియో, వీడియో సౌకర్యంతోపాటు గురుస్వామి వెంట మరో నలుగురికి ఉచిత ప్రయాణం అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. కిలోమీటరుకు రూ.59ఖర్చుపై సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ గీత కృష్ణ, పెద్దపల్లి స్టేషన్‌మేనేజర్ కేఆర్‌రెడ్డి, మాజీఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చెకుముకి సైన్స్ సంబరాలు

పెద్దపల్లిటౌన్/కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాలు, జిల్లాస్థాయిపోటీలు శుక్రవారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నతపాఠశాలలో విజయవంతంగా ముగిశాయి. ఈసందర్భంగా ఎంఈవో సురేందర్, మాజీఎంఈవో డానియల్, జిల్లా చెకుముకి కన్వీనర్ లక్ష్మణ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి శాస్త్రీయ వైఖరిని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని 14మండలాల నుంచి మొత్తం 78మంది విద్యార్థులు పాల్గొనగా, పలు పాఠశాలల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ ఏడాది రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు డిసెంబర్ మూడో వారంలో కరీంనగర్‌జిల్లాలో జరుగనున్నాయని, జిల్లా విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరుకావాలని నిర్వాహకులు ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ రత్నం, ఉపాధ్యాయురాలు శ్రీలక్ష్మి, జేవీవీ సభ్యులు షకీల్, జై శ్రీవిష్ణు, స్వామి, ఎండీ రహీం, కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు కాసులు ఎట్లా?

- ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఆశలు
- దిక్కులు చూస్తున్న ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు
- ఆస్తులను కుదువ పెడుతున్న మరికొందరు



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఎన్నికల్లో గెలవాలంటే నామినేషన్ వేయాలి.. ప్రచారం చేయాలి. అందుకు కార్యకర్తలు, ప్రచార సామగ్రి తదితరాలు కావాలి. వీటన్నింటి కోసం డబ్బు కావాలి.. అకస్మాత్తుగా వచ్చిన ఎన్నికల నోటిఫికేషన్‌తో పోటీ చేసే అభ్యర్థులు కావాల్సినంత డబ్బు లేక నానా అవస్థలు పడుతున్నారు.

కోర్టులో బీసీ రిజర్వేషన్ల అంశం తేలేవరకు ఇప్పట్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగవని స్థానిక నేతలు నింపాదిగా ఉండగా, అకస్మాత్తుగా పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఆశావహులు ఆందోళనకు గురవుతున్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు డబ్బులు సమకూర్చుకునేది ఎలా అనే ఆలోచనలో పడ్డారు. అప్పులు ఇచ్చే వారి చుట్టూ తిరుగుతున్నారు. కొందరు ఆస్తుల అమ్మకాలకు తెగ బడుతుండగా, మరికొందరు ఆస్తులు కూడ బెడుతున్నారు. ఈనెల 25వ తేదీన రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ మూడు విడతల్లో డిసెంబర్ 11,14, 17 తేదీల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల 27న విడుదల కాగా, 29వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. మొదటి విడతలో కాల్వ శ్రీరాంపూర్, మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాల్లోని 99గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలతో పాటు 896వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. రెండోవిడతలో పాలకుర్తి, అంతర్గాం, ధర్మారం, జూలపల్లి మండలంలోని 73గ్రామపంచాయతీలోని సర్పంచ్ స్థానాలకు, 684 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మూడో విడతలో సుల్తానాబాద్, ఎలిగేడు, పెద్దపల్లి, ఓదెల మండలాల్లోని 91 గ్రామపంచాయతీల సర్పంచ్ స్థానాలతో పాటు 852వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఈ ఎన్నికల్లో పోటీచేసి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని అభ్యర్థులు ఆశ పడుతున్నారు. గ్రామ పంచాయతీల పదవీకాలం 2024జనవరి నెలాఖరుతో ముగియగా మరుసటి నెలలోనే ఎన్నికల నిర్వహించాల్సిన ప్రభుత్వం నిర్వహించలేదు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీ మేరకు ఎన్నికలను సకాలంలో నిర్వహించలేకపోయింది. ఇందుకోసం కులగణన సర్వే చేపట్టి బీసీ డెడికేషన్ కమిషన్ ప్రభుత్వం వేసింది. కుల గణన సర్వేకు అసెంబ్లీ ఆమోదం తెలుపగా డెడికేషన్ కమిషన్ సూచన మేరకు బీసీలకు శాతం రిజర్వేషన్లు కల్పిం

(మిగతా 8వ పేజీలో)

● కనీసం రూ.10లక్షలైనా ఉండాలి..

సర్పంచ్‌గా పోటీ చేయాలంటే కనీసం 10లక్షల రూపాయలైనా ఉండాలి. బీసీ, జనరల్ స్థానాల్లో ఆయా గ్రామ పంచాయతీలను బట్టి 10నుంచి 50లక్షలకు పైగా ఎన్నికల ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. నామినేషన్లు వేసిన దగ్గర నుంచి గుర్తులు కేటాయించే వరకు, ఆ తర్వాత పోలింగ్ వరకు వారం రోజుల పాటు ప్రచార నిర్వహించాల్సి ఉంటుంది. ప్రచార ఖర్చులతో పాటు పోల్ మేనేజ్మెంట్ కోసం డబ్బులు అవసరం ఉంటాయి. ఆ డబ్బుల కోసం అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు ఎమ్మెల్యేలపై ఆశలు పెంచుకోగా, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ నేతలు దిక్కులు చూస్తున్నారు. జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే ఉన్నారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు తమ అభ్యర్థుల గెలుపు కోసం ఖర్చు పెట్టే పరిస్థితిలో ఉన్నట్లుగా కనబడడం లేదు. దీంతో ఆయాపార్టీకి చెందిన ఆశావహులు, అభ్యర్థులు డబ్బుల కోసం ఆస్తులను కొందరు కుదువపెట్టి రుణాలు తీసుకువస్తుండగా, మరికొందరు అమ్మకానికి పెట్టారు. ఏడాదిన్నర కాలంగా గ్రామ ప్రజలు ఎన్నికల్లో పోటీచేయాలని తహతహలాడుతున్నా కొందరు నాయకులు ఈ ఎన్నికల్లో తాడోపేడో తేల్చుకోవాలని చూస్తున్నారు. అప్పులు చేసైనా తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని చూస్తున్నారు.

యువత ఉపాధి కల్పనకు చర్యలు: కలెక్టర్



కళాశాలల యాజమాన్యాలు, అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లాస్థాయి జాబ్‌మేళా నిర్వహణపై పలు కళాశాలల యాజమాన్యాలు, అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా టాస్క్ రీజినల్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి జాబ్‌మేళా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. షెడ్యూల్ ఖరారు కాగానే కళాశాలలకు సమాచారం అందిస్తామని పేర్కొన్నారు. మంథనిలో మరో టాస్క్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. డిగ్రీ పూర్వవిద్యార్థులు, ఫైనల్ ఇయర్ చదువుతున్న కనీసం 50మంది జాబ్ మేళాకు హాజరుకావాలని, ప్రతికళాశాల నుంచి ఒక కోఆర్డినేటర్‌ను నియమించాలని కలెక్టర్ సూచించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి..

పెద్దపల్లిటౌన్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన రోడ్డుప్రమాదాల నియంత్రణ చర్యలపై స్థానికసంస్థల అదనపుకలెక్టర్ జే అరుణశ్రీతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రోడ్లపైకి పశువులు రాకుండాచూడాలని, పశువుల యజమానులకు పక్కా సూచనలు జారీ చేయాలన్నారు. రోడ్ల వద్ద వాహనాల వేగం నియంత్రణ కోసం బ్లాక్ స్పాట్స్ వద్ద రేడియం స్టిక్కర్లతో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆటోలను మైనర్లు నడుపుతున్నట్లు సమాచారం ఉందని, దీనిని రెగ్యులర్‌గా ట్రాక్‌చేయాలని ట్రాఫిక్ అధికారులకు సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు వైద్యఖర్చులు నిమిత్తం కలెక్టరేట్ వద్ద ప్రత్యేక ఖాతా ప్రారంభించే పని చేపట్టామని తెలిపారు. మల్లెపల్లి నుంచి గుంజపడుగు, ఆరెంద, నాగపల్లి రోడ్డు, ఇతర రోడ్డుమరమ్మతు పనుల ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నూతన రోడ్ల నిర్మాణానికి అడ్డుగాఉన్న విద్యుతు స్తంభాలను ప్రాధాన్యత క్రమంలో షిఫ్టింగ్‌చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో ఏసీపీ రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఈఈ బావ్ సింగ్, మున్సిపల్‌కమిషనర్లు వెంకటేష్, మనోహర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలి

● మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీసీలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి స్థానికసంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం గోదావరిఖని చౌరస్తాలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కామారెడ్డి డిక్లరేషన్ సభలో బీసీలకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీకి, కాంగ్రెస్‌కు ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టాలని అన్నారు. ఓట్ల కోసంవచ్చే కాంగ్రెస్‌పార్టీ నాయకులను కళ్యాణలక్ష్మి, తులం బంగారం, రూ.4వేల పెన్షన్, రైతుబంధు, రైతుబీమాపై నిలదీయాలని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఆముల నారాయణ, గోపు ఐలయ్యయాదవ్, బొడ్డు రవీందర్, కల్వచర్ల కృష్ణవేణి, గాదం విజయ, బాదె అంజలి, పర్లపల్లి రవి, మారుతి, నట్టు శ్రీనివాస్, దేవరాజు, గంగరాజు, ఇరుగురాళ్లశ్రావణ్, కోడి రామకృష్ణ పాల్గొన్నారు.

దళిత, బహుజనులకు స్ఫూర్తి ప్రదాత జ్యోతిరావు పూలే 8లో..

ఖనిలో సీఎం, మంత్రులు, ఎమ్మెల్యే చిత్రపటాలకు.. క్షీరాభిషేకం 8లో..

ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలి: డీసీపీ



కాల్వశ్రీరాంపూర్‌లో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీపీ రాంరెడ్డి

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని పెద్దపల్లి డీసీపీ రాంరెడ్డి అన్నారు. సర్పంచ్, వార్డుమెంబర్ల ఎన్నికల్లో భాగంగా శుక్రవారం నామినేషన్ల ప్రక్రియను ఆయన పరిశీలించారు. కాల్వశ్రీరాంపూర్‌లోని కేంద్రాన్ని పరిశీలించి, పోలీసులకు తగు సూచనలు చేశారు. ఆయాపార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఎలాంటి గొడవలు లేకుండా సామరస్య పూర్వకంగా ప్రచారం నిర్వహించుకోవాలని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే పోలీసుల సమక్షంలో చర్చించుకోవాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

పోలీస్‌స్టేషన్ల తనిఖీ..

జూలపల్లి: జూలపల్లి పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం పెద్దపల్లి డీసీపీ భూక్యారాంరెడ్డి తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయనకు సిబ్బంది గార్డ్ ఆఫ్‌హానర్ నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయతీ ఎన్నికలపై పోలీస్ సిబ్బందికి తగు సూచనలు, సలహాలు చేశారు.

ఓదెల: మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం డీసీపీ రామిరెడ్డి తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలు, వివిధ కేసులలో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. స్టేషన్ పరిధిలో అత్యధికంగా ఎలాంటి నేరాలు నమోదవుతాయి, సమస్యాత్మక గ్రామాల, సరి హద్దు ప్రాంతాల వివరాలు, రౌడీషీటర్లు, అనుమా నితులు వారి ప్రస్తుత స్థితిగతులను ఎస్ఐ రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. నిరంతం పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. బ్లూకోల్ట్ సిబ్బంది పనితీరుతోపాటు, వారు విధులు నిర్వహించే సమయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు.

సుల్తానాబాద్: సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసుల వివరాలను తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఆయనవెంట పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి ఉన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు ఖని విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈనెల27నుంచి 30వ తేదీవరకు జరుగనున్న 28వ జాతీయస్థాయి కరాటేపోటీల్లో గోదావరిఖని సెక్రెడ్‌హార్ట్ హైస్కూల్‌కుచెందిన విద్యార్థులు ఎ నివేన్‌రెడ్డి, విష్ణుప్రియ, అక్షిత, సాన్వి, సురక్ష, సంజనప్రియ, మిథిలేశ్, ఆరాధ్య, నందన పాల్గొననున్నారని ప్రిన్సిపల్ ఆరోగ్యమేరి తెలిపారు. ప్రిన్సిపల్ ఆరోగ్యమేరి, ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్ జ్యోత్స్న విద్యార్థులను అభినందించారు.

వ్యక్తులను చంపి విప్లవాన్ని ఆపలేరు

● మధు సంస్మరణ సభలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్



సభలో మాట్లాడుతున్న గడ్డం లక్ష్మణ్

పాలకుర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భూమి, భుక్తి, పేదప్రజల విముక్తి కోసం పోరాడుతున్న వ్యక్తులను చంపి విప్లవాన్ని ఆపలేరని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ అన్నారు. మండలం పరిధిలోని రాణాపూర్ గ్రామంలో శుక్రవారం ఏగొలపు మల్లయ్య అలియాస్ మధు యాదిలో చల్లాక అమరుల సంస్మరణ సభను మల్లయ్య కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. విప్లవమార్గం వ్యక్తిపై ఆధారపడి ఉండదని, అది ఒక వ్యవస్థ అని అన్నారు. ఈ గ్రామ ముద్దుబిడ్డ ఏగోలపు మల్లయ్య అలియాస్ మధు తన ఆరుగురు సహచరులతో కలిసి బూటకపు ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసి నేటికి ఏడాది కావస్తోందన్నారు. ఆపరేషన్ కగార్‌ను, ఆదివాసీలపై దాడులను నిలిపి, మావోయిస్టులతో ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలన్నారు. మధు స్థూపంపై ఆయన సహచరి మీనా ఎర్రజెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామం విప్లవ నినాదాలతో, జననాట్య మండలి కళాకారుడు ఏట రవి బృందం ఆలపించిన విప్లవగేయాలతో మారుమోగింది.

కార్యక్రమంలో మల్లయ్యకుటుంబ సభ్యులతోపాటు హస్సేన్, పద్మకుమారి, కె సావిత్రీదేవి, ఎరుకల రాజయ్య మాట్లాడారు. గుమ్మడి కొమురయ్య, బొంకూరి లక్ష్మయ్య, ముడి మడుగుల మల్లయ్య, బంధుమిత్రులు గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి చదరంగ పోటీలు

కోల్‌సిటీటౌన్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాచదరంగ సమాఖ్య, మంతెన సత్యనారాయణ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పెద్దపల్లి పట్టణంలోని అమర్‌చంద్ కళ్యాణ మండపంలో దివంగత మంతెనఅరుణ స్మారక చదరంగపోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లాచదరంగ సమాఖ్య అధ్యక్షుడు గడ్డాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలో పాల్గొనదలచిన క్రీడాకారులు ఆదివారం ఉదయం 9గంటలలోపు కళ్యాణ మండపంలో వారిపేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. అండర్-9, అండర్11 క్రీడాకారులకు ప్రత్యేక బహు మతులు అందజేస్తామని వివరించారు. క్రీడాకారులు చెస్ బోర్డులు, పావులు వెంట తెచ్చుకోవాలని తెలిపారు. క్రీడాకా రులకు మధ్యాహ్నభోజన సౌకర్యం సమకూరుస్తామని పేర్కొ న్నారు. వివరాలకు జి శ్రీనివాస్ సెల్.9515342207, పడాల నాగరాజు 9848676263, సూరజ్‌భానుసింగ్ 8096659481లో సంప్రదించాలని సూచించారు.

బదిలీ అయిన సిబ్బందికి వీడ్కోలు

పెద్దపల్లిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో సేవలు అందిస్తూ, డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్లోని సాంక్షన్ పోస్టులకు బదిలీఅయిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వీడ్కోలు సమావేశం నిర్వహించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి వాణిశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ వాణిశ్రీ మాట్లాడుతూ తక్కువ వేతనంతో ఎక్కువ బాధ్యతతో పనిచేసి, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అభివృద్ధిలో వీరు కీలకంగా వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో వీరగోని శ్రీనివాస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఆర్ రాజమౌళి, డాక్టర్ బి శ్రీరాములు, డాక్టర్ కేవీ సుధాకర్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లి మృతిని తట్టుకోలేక కుమారుడి ఆత్మహత్య

తంగళ్లపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తల్లి మృతిని తట్టుకోలేక తనయుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన మంచికట్ల లలిత(56) సిరిసిల్ల పట్టణంలో మానేరు నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఇది తట్టుకోలేక కుమారుడు మంచికట్ల అభిలాష్(34) అదే మానేరు నదిలో దూకిఆత్మహత్య చేసుకున్నాడు. నాలుగేళ్ల క్రితం తండ్రి మంచికట్ల దేవరాజ్ ప్రమాదవశాత్తు మృతిచెందాడు. దేవరాజు పవర్‌లూం కార్మికుడిగా, లలిత బీడీ కార్మికురాలిగా పనిచేస్తూ కొడుకు, ఇద్దరు కూతుళ్లను పోషించారు. కుమారుడు అభిలాష్ కానిస్టేబుల్‌గా 2013 సంవత్సరంలో ఉద్యోగం సాధించాడు. ఈ క్రమంలో నాలుగేళ్ల క్రితం మంచికట్ల దేవరాజ్ మృతిచెందాడు. ఇద్దరు ఆడపిల్లల పెళ్లిళ్లను తల్లి లలిత, కుమారుడు అభిలాష్‌లు చేశారు. వారం రోజులుగా లలిత మానసిక పరిస్థితి బాగాలేదని బంధువులు చెప్పారు. అభిలాష్ విధులకు హాజరై గురువారం ఇంటికి వచ్చేసరికి తల్లి కనిపించక పోవడంతో ఆందోళనకు గురయ్యాడు. మిత్రులతో కలిసి తల్లి ఆచూకీ కోసం వెతికారు. శుక్రవారం మధ్యాహ్నం సిరిసిల్ల ఎల్లమ్మ గుడి సమీపంలో మానేరు నదిలో లలిత మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న అభిలాష్, మిత్రులతో కలిసి మానేరు నది తీరానికి చేరుకుని తల్లి మృతదేహాన్ని చూసి తీవ్ర ఆవేదనకు లోనయ్యాడు. బంధువులు, మిత్రులు ఓదారుస్తుండగానే ఒక్కసారిగా మానేరు నదిలోకి దూకాడు. మిత్రులకు ఈత రాకపోవడంతో కేకలు వేస్తుండగా అక్కడికి చేరుకున్న పోలీసులు ఎస్‌డీఆర్ఎఫ్ బృందాన్ని రప్పించి గాలింపు చేపట్టారు. పట్టణ సీఐ కృష్ణతో పాటు సిబ్బంది, ఎస్‌డీఆర్ఎఫ్ బృందం సుమారు రెండు గంటల పాటు గాలింపు చేపట్టిన తర్వాత అభిలాష్ మృతదేహం బయటపడింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

పంట పొలంపై అడవిపందుల దాడి


పంటను పరిశీలిస్తున్న అధికారులు

రుద్రంగి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పంట పొలాలపై అడవిపందులు దాడి చేశాయి. కంటె రెడ్డి అనే రైతుకు చెందిన ఎకరం వరి పంట నష్టం చేయడంతో సుమారు 50 వేల నష్టం జరిగిందని రైతు తెలిపారు. అడవిపందులు, జంతువులు తరచూ పంటపొలాలపై దాడి చేస్తున్నాయని, వాటివల్ల పంట నష్టం అవుతోందన్నారు. గతంలో అడవిపందుల దాడిలో చాలామంది రైతులకు గాయాలు అయ్యాయని, దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. అడవిపందుల దాడిలో నష్టపోయిన పంటను వ్యవసాయ విస్తరణ అధికారి జ్యోతి పరిశీలించి నష్టపరిహారం కోసం సంబంధిత అధికారులకు నివేదిస్తామన్నారు.

విద్యార్థులకు స్కౌట్స్ శిక్షణ

- దేశభక్తి, క్రమశిక్షణ, అంకితభావం పెంపు
- పీఎం శ్రీ మోడల్ స్కూళ్లలో యూనిట్ల ఏర్పాటు




ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లె కేజీబీవీలో స్కౌట్స్ శిక్షణ తీసుకుంటున్న విద్యార్థినులు

ఇల్లందకుంట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక సేవ, అంకితభావం పెంపొందించేందుకు శిక్షణ ఇవ్వనుంది. శారీరక దారుఢ్యంతో పాటు మానసిక వికాసం, ఉజ్వల భవిష్యత్‌కు ఈ శిక్షణ ఎంతగానో తోడ్పడనుంది. పీఎంశ్రీ మోడల్ స్కూల్, టీఆర్‌ఈఐఎస్ స్కూళ్లతో పాటు కేజీబీవీల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. వీటిలో ఇల్లందకుంట మండలంలోని మోడల్ స్కూల్‌లో 177 మంది విద్యార్థులు, కేజీబీవీలో 286 మంది విద్యార్థులకు విడతల వారీగా 64మంది విద్యార్థులకు శిక్షణ అందిస్తారు. ఒక్కో విద్యార్థికి రూ.2 వేల చొప్పున నిధులు మంజూరు చేయగా నిర్వహణకు వెచ్చించనున్నారు.

● చురుకైన బాలికలకు ప్రాధాన్యం

కేజీబీవీల్లో 6వ తరతగతి నుంచి 9వ తరగతి బాలికలకు స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో అవకాశం కల్పిస్తారు. ఇందులో చురుకైన విద్యార్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. కేజీబీవీ పాఠశాల నుంచి 32మంది విద్యార్థినిలతో యూనిట్లు ఏర్పాటు చేస్తారు. యూనిట్‌లో చేరే విద్యార్థునులకు ప్రత్యేక యూనిఫామ్ అందజేస్తారు. నిత్యం సాధన, కవాతు, సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తారు.

● ప్రతి ఏటా మూల్యాంకనం

స్కౌట్స్ అండ్ గైడ్స్ పనితీరును జిల్లా స్కౌట్స్ కమిషన్ ఏటా మూల్యాంకనం చేస్తారు. మూడేళ్ల శిక్షణ పూర్తయిన తర్వాత రాష్ట్ర గవర్నర్ సంతకంతో కూడిన సర్టిఫికెట్ అందజేస్తారు. నాలుగేళ్ల పూర్తయితే రాష్ట్రపతితో సర్టిఫికెట్ ప్రధానం చేస్తారు.

● పాఠశాలల్లో కూడా...

పీఎం శ్రీ పాఠశాలతో పాటు మోడల్ స్కూళ్లలో కూడా స్కౌట్స్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ఆదేశాలు వచ్చాయి. ఇల్లందకుంట మండలంలోని కేజీబీవీలో 32మంది, మోడల్ స్కూల్‌లో 32మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు.

● ప్రయోజనం ఇలా..

స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా విద్యార్థులకు వ్యక్తిత్వం, పట్టు, జట్టు కృషి, నాయకత్వం, సమస్య పరి ష్కారం, విధి నిర్వహణ, క్రమశిక్షణ, సేవ విలువలు పెంపొందుతాయి. క్రమం తప్పకుండా సమాజసేవ ద్వారా పౌరసత్వాన్ని నిర్మిస్తుంది. వారాంతపు బహి రంగ కార్యకలాపాలు శక్తిని మెరుగుపరుస్తాయి. స్క్రీన్ టైం తగ్గించనున్నాయి. బాలికలు వెనుక బడిన నేపథ్యాల నుంచి వచ్చిన పిల్లల్లో సమా నత్వం పెరుగుతుంది. విద్యార్థులు సిబ్బందికి ప్రథ మ చికిత్స, అగ్ని భద్రత, విపత్తు, సంసిద్ధత, పాఠ శాల భద్రత, కసరత్తులో శిక్షణ ఇస్తారు. జీవ వైవి ధ్యం, మ్యాపింగ్, కిచెన్ గార్డెన్, నీటి ఆడిట్, వ్యర్థాల విభజన, వ్యవస్థల్లో పాల్గొనడం పర్యావరణ నిర్వహ ణలలో భాగస్వామ్యం కానున్నారు.

విద్యార్థుల్లో సామాజిక సేవ అలవడుతుంది

– అయిలయ్య, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, బేకుర్తి



స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో సామాజిక సేవ అలవడుతుంది. మోడల్ స్కూల్లో 16 బాలురు, 16మంది బాలికలను ఎంపిక చేయడం జరిగింది. దీనికి 64వేల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగింది.

విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందుతుంది

– లావణ్య, కేజీబీవీ స్పెషలాఫీసర్, శ్రీరాములపల్లె



విద్యార్థులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ఇవ్వడం ద్వారా దేశభక్తి పెంపొందుతుంది. అంతేకాకుండా క్రమశిక్షణ, అంకితభావం ఏర్పడుతుంది. కేజీబీవీలో 32మంది విద్యార్థులను ఎంపిక చేస్తాం. దీనికి నిధులు కూడా మంజూరయ్యాయి.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరి మృతి


రవీందర్‌రెడ్డి (ఫైల్)

ఇల్లంతకుంట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తెనుగువారిపల్లె గ్రామానికి చెందిన వంచ రవీందర్‌రెడ్డి (42) అనే యువకుడు మృతిచెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. ద్విచక్రవాహనంపై సిద్దిపేటకు వెళ్లి స్వగ్రామానికి వస్తుండగా చిన్నకోడూరు మండలం గంగాపూర్ సమీపంలో రోడ్డుపై పోసిన వరిధాన్యం కుప్పపై వాహనం ఎక్కగా కిందపడి మృతిచెందాడు. మృతునికి భార్య సుప్రియ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రవీందర్‌రెడ్డి మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్

● ఒకరికి తీవ్ర గాయాలు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): లారీ, బైక్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి గాయాలైన ఘటన కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మీర్జంపేట గ్రామానికి చెందిన బూర్క అశోక్ కాల్వశ్రీరాంపూర్‌లోని వార సంతలో కూరగాయలు కొనుగోలు చేసుకొని ద్విచక్రవాహనంపై మీర్జంపేటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇప్పలపల్లి గ్రామశివారులో ఓ టిప్పర్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో అశోక్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే అతన్ని 108లో ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ వెంకటేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు.

ఇంటర్వ్యూ ప్రాణం తీసింది

● 26 సంవత్సరాల ప్రతీకారం ● సంఘటన స్థలాన్ని సందర్శించిన ఎస్పీ ● మాజీ నక్సలైట్ సిద్ధన్న హత్యోదంతం


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్ బి. గీతే

వేములవాడ టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇంటర్వ్యూ మాజీ నక్సలైట్ ప్రాణం తీసింది. రూ.50వేలు ఇస్తే ఇంటర్వ్యూ ఇస్తానని చెప్పి పిలిచి ప్రాణం తీసుకున్నాడు. వేములవాడ మండలంలోని గుర్రవానిపల్లి ఎదురుగా ఉన్న అగ్రహారం గుట్టల్లో తంగళ్లపల్లి మండలంలోని గండిలచ్చక్కపేట గ్రామానికి చెందిన బల్లెపు నర్సయ్య అలియాస్ సిద్ధన్న హత్యకు గురైంది తెలిసిందే. సిద్ధన్న హత్య విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యుల వేములవాడకు చేరుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదుచేసి సిద్ధన్న మృతదేహానికి పంచనామా అనంతరం ఏరియా ఆసుపత్రికి తరలించామని టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించడంతో గండిలచ్చపేటకు తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్పీ మహేష్ బి. గీతే సందర్శించి పరిశీలించారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో ఉన్న కుటుంబ సభ్యులతో ఎస్పీ మాట్లాడారు. 1990లో పీపుల్స్‌వార్ దళ సభ్యుడిగా చేరిన సిద్ధన్న దళ కమాండర్ స్థాయికి ఎదిగాడు. 2004లో పోలీసులకు లొంగిపోయి స్వగ్రామమైన గండిలచ్చపేటలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. బీఆర్ఎస్ పార్టీ క్రియాశీల కార్యకర్తగా కొనసాగుతున్నాడు. ఈ క్రమంలో ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూ ప్రాణాలను బలిగొంది.

● తండ్రి హత్యకు తనయుడి ప్రతీకారం

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన జక్కుల అంజయ్య ఇన్‌ఫార్మర్ పేరిట ఏప్రిల్ 9, 1999న అప్పటి పీపుల్స్‌వార్ నక్సలైట్ల చేతిలో హత్యకు గురయ్యాడు. దీంతో అంజయ్యకు కుటుంబం వీధినపడింది. అప్పటినుంచి అతడి భార్య, పిల్లలు జగిత్యాలలోనే ఉంటు న్నారు. ఇటీవల ఓ యూట్యూబ్ చానల్‌కు పీపుల్స్‌వార్ మాజీ దళకమాండర్ హోదాలో సిద్ధన్న ఇంటర్వ్యూ ఇచ్చాడు. ఈ ఇంటర్వ్యూను చూసిన అంజయ్య కుమారుడు సంతోష్ తన తండ్రి హత్యకు కారణమైన సిద్ధన్నను హతమార్చాలని పథకం వేశాడు. వారం రోజుల క్రితం ఓ యూట్యూబ్ విలేకరిగా సిద్ధన్నకు ఫోన్‌చేసి పరిచయం చేసుకున్నాడు. ఇంటర్వ్యూ ఇవ్వాలని సిద్ధన్నను రెండు మూడు సార్లు కోరినప్పటికీ వీలుకాదని చెప్పిన సిద్ధన్న గురువారం ఇంటర్వ్యూకు వీలవుతుందని చెప్పగానే సంతోష్ జగిత్యాల నుంచి వెంటనే గురువారం సాయంత్రం 5గంటలకు సిరిసిల్లకు చేరుకున్నాడు. జనాల మధ్య సక్రమంగా రాదని గుట్టలు, చెట్లు ఉంటే ఇంటర్వ్యూ బాగుంటుందని సిద్ధన్నను నమ్మించి అగ్రహారం గుట్టల్లోకి తీసుకు వచ్చాడు. అప్పటికే పథకం ప్రకారం సిద్ధన్నకు కల్లు తాగించి బండరాయి తలపై ఎత్తివేసి దారుణంగా హత్యచేశాడు. ఆ తర్వాత మరో బండరాయిని తలపై వేసి సిద్ధన్న చనిపోయినట్లు నిర్ధారించుకొని నేరుగా అగ్రహారం నుంచి జగిత్యాలకు వెళ్లి పోలీసులకు లొంగిపోయాడు. ఆ తర్వాత వేములవాడ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

స్వగ్రామం చేరిన సిద్ధన్న మృతదేహం

– దుబాయ్ నుంచి బయలుదేరిన కుమారుడు

తంగళ్లపల్లి: హత్యకు గురైన తంగళ్లపల్లి మండలంలోని గండిలచ్చపేట గ్రామానికి చెందిన బల్లెపు నర్సయ్య అలియాస్ సిద్ధన్న మృతదేహం శుక్రవారం స్వగ్రామానికి చేరింది. సిద్ధన్నకు ఇద్దరు భార్యలు పోచవ్వ, ఎల్లవ్వలు, ఇద్దరు కుమారులు అశోక్, నరేశ్, ఒక కూతురు పద్మ ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడు అశోక్ ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. తండ్రి హత్యకు గురైన విషయం తెలుసుకున్న కుమారుడు దుబాయ్ నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. శనివారం సిద్ధన్న అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ఆర్టీసీ స్థలం ఆక్రమించే యత్నం.. ఆరుగురిపై కేసు


వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై చిరంజీవి

కోరుట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ డిపో స్థలాన్ని కబ్జా చేయయానికి ప్రయత్నించిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి శుక్రవారం తెలిపారు. ఆర్టీసీకి సంబంధించిన స్థలంలో రెండు రోజుల నుంచి కోరుట్ల పట్టణానికి చెందిన ఆరుగురు వ్యక్తులు చదును చేసి నిర్మాణం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. డిపో మేనేజర్ మనోహర్ ప్రశ్నించంగా వారు దురుసుగా ప్రవర్తిచడంతో మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు స్థలం వద్దకు వెళ్లి ఎస్ఐ చిరంజీవి పరిశీలించారు. సరైన దస్తవేజులు లేకపోవ డంతో డిపో మేనేజర్ మనోహర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణానికి చెందిన పసుల చిన్ననర్స య్య, అతని భార్య వనిత, అతని కొడుకు నాగరాజు, అంబేద్కర్ నగర్‌కు చెంది న మాగోని మహేందర్, ఆకుల ఆనంద్, పాముల వెంకటరమణలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి వివరించారు.

కోరుట్ల బల్దియాలో విజిలెన్స్ తనిఖీ


తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

కోరుట్ల నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బల్దియాలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. శుక్రవారం కార్యాలయంలోని వివిధ విభాగంలో అధికారులు ఏకకాలంలో దాడులను నిర్వహించి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. రిజిస్టర్ బుక్, వాహనాల మరమ్మతులు, డీజిల్ కొనుగోలు బిల్లులకు సంబంధించిన రికార్డులను విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీందర్‌తో పాటు మున్సిపల్ సిబ్బందిని వివిధ అంశాలపై విచారించారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపారు. విజిలెన్స్ తహసీల్దార్ దినేష్ ఉన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు : ఒకరి మృతి

పెద్దపల్లి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని అందుగులపల్లి గ్రామశివారులో శుక్రవారం ఉదయం అతివేగంగా వస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అందుగులపల్లి గ్రామానికి చెందిన పిడుగు గోపాల్(45) ద్విచక్రవాహనంపై ధర్మారం ఎక్స్‌రోడ్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో పెద్దపల్లి వైపు నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న పిడుగు గోపాల్ కిందపడగా తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

ఫ్లెక్సీ తొలగించారని నిరసన


నిరసన తెలుపుతున్న మృతురాలి కుటుంబ సభ్యులు

కొడిమ్యాల, నవం బరు 28(ఆంధ్ర జ్యోతి): తమ కూతురు తిప్పరవేని మధుశ్రీ శ్రద్ధాంజలి ఫ్లెక్సీని పంచాయతీ సిబ్బంది తొలిగించారని మండల కేంద్రానికి చెందిన తిప్పరవేని మమత నాగరాజు దంపతులు, కుటుంబ సభ్యులు శుక్రవారం సాయంత్రం కొడిమ్యాల కోనాపూర్ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రమాదానికి గురై తమ కూతురు మృతిచెందిన బాధలో ఉంటే పంచాయతీ సిబ్బంది ఫ్లెక్సీ తొలించడం ఏమిటని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఫెక్సీల తొలిగింపులో భాగంగా కొడిమ్యాల గ్రామపంచాయతీ సిబ్బంది ఎన్నికల్లో పాల్గొనే నాయకుడి ఫొటోతో పాటుగా, పలువురు యువకులతో కలిసి ఉన్న ఫ్లెక్సీని తొలిగించకుండా మృతి చెందిన తమ కూతురు ఫ్లెక్సీ ఎందుకు తొలిగించారని అరగంట సేపు ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ సౌందర్య, పోలీసులు, గ్రామ కార్యదర్శి ఎల్ వంశీవర్ధన్ సంఘటన స్థలానికి వచ్చి వారిని సమదాయించారు. అనంతరం శ్రద్ధాంజలి ఫ్లెక్సీ తిరిగి ఏర్పాటు చేయించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అభ్యంతరం తెలిపిన ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీలను గ్రామపంచాయతీ సిబ్బంది తొలిగించారు. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.

108 అంబులెన్స్ తనిఖీ

ధర్మారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 108 అంబులెన్స్‌ను శుక్రవారం జిల్లా కో-ఆర్డినేటర్ కుమారస్వామి తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో ఉన్న మందుల సమాచారం తెలుసుకున్నారు. మెడికల్ ఎక్విప్మెంట్స్ పనితీరుతో పాటు రికార్డులను పరిశీలించారు. ఎమర్జెన్సీ కేసులకు వెంటనే స్పందించాలని ఈఎంటీ ఆరే సతీష్, పైలట్ శ్రీనివాస్‌కు సూచించారు. ధర్మారం, జూలపల్లి మండలాల ప్రజలు అత్యవసర సమయాల్లో అంబులెన్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెద్దూర్ డబుల్ బెడ్‌రూం కాలనీవాసుల నిరసన


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న డబుల్‌బెడ్‌రూం కాలనీవాసులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులోని డబుల్ బెడ్‌రూం కాలనీలో నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీ మహిళలు శుక్రవారం ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. వారానికి ఒక్కసారి మిషన్‌భగీరథ నీరు వస్తోందని, సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్‌రూం కాలనీని బీజేపీ పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ నాయకులతో కలిసి సందర్శించారు. కాలనీలో సమస్యలను తెలుసుకున్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ పట్టణంలోని ఇల్లు లేని నిరుపేదలకు బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దూర్ శివారులో 450 డబుల్ బెడ్‌రూంలను నిర్మించి ఎలాంటి వసతులు లేకుండా లబ్ధిదారులకు ఇవ్వడంతో అక్కడ నివాసం ఉంటున్న వారు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీనిపై మున్సిపల్ అధికారులతోపాటు జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి కాలనీలో అన్ని వసుతులతో పాటు నీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. లేకుంటే మున్సిపాలిటీ ఎదుట కాలనీ ప్రజలతో తరలివచ్చి ధర్నా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సూరం వినయ్, రచ్చరాహూల్, దేవరాజు కాలనీ మహిళలు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ మాజీ కార్పొరేటర్ భార్య మృతి


కుర్ర తిరుమల(ఫైల్

కరీంనగర్ క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి భరించలేక ఎలుకల మందుతాగిన మాజీ కార్పొరేటర్ భార్య కుర్ర తిరుమల(40) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని కిసాన్‌నగర్‌కు చెందిన తిరుమల కడుపునొప్పి భరించలేక ఈ నెల 26న ఎలుకల మందు తాగింది. వెంటనే ఆమె భర్త కుర్రతిరుపతి ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా మృతి చెందింది. తిరుమల సోదరుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దుబాయ్‌లో రోడ్డు ప్రమాదం

● లక్ష్మీపూర్ వాసి మృతి


గంగాధర్ (ఫైల్)

గొల్లపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కోసం దుబాయ్‌కి వెళ్లిన గొల్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గడప గంగాధర్ (45) ఈ నెల 16న దుబాయ్‌లో రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఉన్న ఊరిలో ఉపాధి కరువై ఉపాధి కరువై 18 నెలల క్రితం అప్పులు చేసి గంగాధర్ దుబాయ్ వెళ్లాడు. అక్కడి ఓ ప్రైవేట్ కంపెనీలో కారు డ్రైవర్‌గా పనిచేస్తూ ఉపాధి పొందుతున్నాడు. ఈ నెల 16న పనులు ముగించుకుని రూంకు వస్తున్న క్రమంలో రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు ట్రక్కు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. దీంతో అక్కడి పోలీసులు గుర్తుతెలియని మృతదేహంగా భద్రపరిచారు. తోటి మిత్రులు 18 రోజుల అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడికి భార్య లక్ష్మీ, కుమారుడు మహేందర్, కుమార్తె ఆదా ఉన్నారు. మృతదేహంను త్వరగా స్వగ్రామానికి పంపించాలని, బాధిత కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

శంభునిపల్లి శివారులో మృతదేహం లభ్యం

హత్య చేసి గోనె సంచిలో చుట్టినట్లు పోలీసుల గుర్తింపు

జమ్మికుంట రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం శంభునిపల్లి-తనుగుల గ్రామాల మధ్య శుక్రవారం ఓ మృతదేహం లభ్యమైంది. హత్య చేసి మృతదేహాన్ని గోనె సంచిలో చుట్టి రోడ్డు పక్కన పత్తి చేనులో పడేసినట్లు పోలీసులు గుర్తించారు. రోడ్డు వెంట దుర్వాసన వస్తుండటంతో స్థానికులకు అనుమానం వచ్చి చూశారు. గోనెసంచిలో మృతదేహం ఉన్నట్లు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. హుజూరాబాద్ ఏసీపీ మాధవి, పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్, ఎస్ఐలు క్రాంతికుమార్, సతీష్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్ ఎదుట గోనె సంచుల నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. అప్పటికే రెండు, మూడు రోజులు గడిచిపోవడంతో మృతదేహం పూర్తిగా కుళ్లిపోయింది. తీవ్రగాయాలైన ఆనవాళ్లు సైతం కనిపించాయి. మృతుడు 30-35సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నట్లు గుర్తించారు. చెవిపోగు, మెడలో సిల్వర్ కలర్ చైన్, కుడి చేతికి దేవుడి కంకణాలు, ఎడమ చేతికి రెడ్ కలర్ బ్యాండ్, బ్లాక్ కలర్ బ్యాండ్ ధరించి ఉన్నాయి. ఈ ఆనవాళ్లు కలిగిన వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే తమకు సమాచారం అందించాలని పోలీస్‌లు కోరారు. క్లూస్ టీం మృతదేహం నుంచి కొన్ని శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు తరలించారు.

డాగ్ స్క్వాడ్ సంఘటన స్థలం నుంచి పరిమల సొసైటీ రోడ్ వైపు కలివిడిగా తిరిగింది. హంతకులు ఎక్కడో హత్య చేసి మృతదేహాన్ని ఇక్కడకు తీసుకు వచ్చి పడేసి, ఆ తర్వాత పరిమల సొసైటీ రోడ్డులో సాఫీగా మద్యం సేవించినట్లు తెలుస్తోంది. డాగ్‌స్క్వాడ్ ఖాళీ మద్యం బాటిళ్లు ఉన్న వద్ద ఎక్కువ సేపు గడుపడం వల్ల పోలీసులు అనుమా నం వ్యక్తం చేస్తున్నారు. పూర్తిగా కుళ్లిపోయిన మృతదేహానికి సంఘటన స్థలం వద్ద పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సర్పంచ్ ఎన్నికలకు 30 గుర్తులు

చొప్పదండి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం గుర్తులను విడుదల చేసింది. సర్పంచ్ అభ్యర్థుల కోసం 30, వార్డు సభ్యులకు 20 గుర్తులను కేటాయించింది.

● సర్పంచ్ అభ్యర్థుల గుర్తులు

చెప్పులు, చెత్తడబ్బా, బెండకాయ, కొబ్బరితోట, టూత్ పేస్ట్, కత్తెర, ఉంగరం, బ్యాట్, ఫుట్‌బాల్, పర్సు, టీవీ రిమోట్, స్పానర్, బ్లాక్ బోర్డు, డైమండ్, బకెట్, డోర్ హ్యాండిల్, టీ జల్లెడ, చేతికర్ర, మంచం, పలక, టేబుల్, బ్యాటరీ లైట్, బ్రష్, బ్యాట్స్‌మెన్, మనిషి తెరచాపతో పడవ, బిస్కెట్, గాలి బుడగ, క్రికెట్ స్టంపులు, చైన్, వేణువు కేటాయించగా వార్డు సభ్యులకు అదనంగా మరో 20 గుర్తులను కేటాయించింది.

28 మంది బైండోవర్

కరీంనగర్ క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో రూరల్ మండలంలోని పలు గ్రామాలలో బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తున్న వారితోపాటు ఎన్నికల్లో కేసులు నమోదైన పాత నేరస్థులు, రౌడీ షీటర్లు 28 మందిని శుక్రవారం బైండోవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు, లక్ష రూపాయల సొంత పూచీకత్తుపై బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

ఇద్దరికి గాయాలు

మల్యాల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మల్యాల క్రాస్ రోడ్డు సమీపంలో ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. కొండగట్టుకు చెందిన మనోజ్‌గౌడ్ ద్విచక్రవాహనంపై జగిత్యాల వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న గోగుల రవి ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి.

● దక్షతకు నియమాలతో కూడిన దీక్షలు
● పవిత్ర పదునెట్టాంబడి అధిరోహణ
● శబరిమల యాత్ర.. జాగ్రత్త..



స్వామియే శరణం అయ్యప్ప

కరీంనగర్ కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్వామియే శరణం అయ్యప్ప... అంటూ శరణుఘోషలు, భజనలతో పులకరిస్తూ కొనసాగించే అయ్యప్ప దీక్ష పవిత్రమైంది. కఠినమైంది. అనేక నియమ నిబంధనలతో కూడుకున్నది. దీక్షాధారి ఆధ్యాత్మిక, క్రమశిక్షణాయుత జీవితానికి అలవాటు పడుతాడు. దేహమే దేవాలయం, పరిశుభ్రతే పరమాత్మ అని నమ్మి దేహంతో పాటు ఇల్లు, పరిసరాలు, ఆలయాలు శుద్ధిగా ఉంచుకుంటూ దీక్షలు కొనసాగిస్తే దక్షత పెరుగుతుంది. ఆరోగ్యం, ఆధ్యాత్మికత, ప్రశాంతత, సరికొత్త జీవన విధానం ఏర్పడుతాయి. దీక్షల్లో స్థాయిలను బట్టి కన్నె, కత్తి, గంట, గద, గురు స్వాములుగా వ్యవహరిస్తుంటారు. ఏ స్థాయి స్వామి అయినా ప్రతి దీక్షాపరుడు అయ్యప్ప ప్రతిరూపంగా భావిస్తుంటారు. తొలిసారి దీక్షను స్వీకరించే వారు తల్లి లేదా గురుస్వామి చేతుల మీదుగా స్వీకరిస్తారు. దీక్షా కాలంలో నియమ నిబంధనలు, శబరిమల యాత్రా జాగ్రత్తలు తప్పకుండా పాటించాల్సిందే. వాటిని తెలుసుకుందాం.

● దీక్షా నియమాలు



- దీక్షాపరుడు పీఠాన్ని ఏర్పాటు చేసుకోవాలి.
- నలుపు రంగు దుస్తులు ధరించాలి. సంప్రదాయాలను అనుసరించి తిరుమణి, శ్రీచూర్ణం, విభూతి, చందనం, గంధం, కుంకుమ బొట్టు ధరించాలి.
- రెండు పూటలు నిత్య ఆరాధన చేయాలి. తొలిసారి దీక్ష తీసుకున్న వారు పెద్ద పాదం నడవాలి. ప్రతీసారి నడవవచ్చు.
- ఒకే పూట అన్నం, రెండో పూట అల్పాహారం స్వీకరించాలి.
- భూ శయ్య, బ్రహ్మచర్యం పాటించాలి. ఆధ్యాత్మిక పుస్తకాలు చదవాలి.
- పాద రక్షలు ధరించరాదు.
- రక్త సంబంధీకులు, పాలివాళ్లు మరణిస్తే మాల విసర్జన చేయాలి.
- అయ్యప్ప ధ్యానంలో గడపాలి.

● పదునెట్టాంబడి విశేషాలు...

వేద, పురాణ, ఇతిహాసాల్లో ఎన్నో విశేషాలున్నాయి. శబరిమలలో ఆలయానికి వెళ్లాలంటే 18 మెట్లు ఎక్కాలి. ఆ మెట్ల సోపానాన్నే పదునెట్టాంబడి అంటారు. కార్తిక మాసంలో దీక్ష చేపట్టిన దీక్షాపరులు పదునెట్టాంబడిని అధిరోహించి అయ్యప్ప స్వామిని దర్శిస్తారు. సన్నిధానం 18 గొప్ప పర్వతాల మధ్య ఉన్నందుననే 18 మెట్లు వచ్చాయని చెబుతారు.



నియమ నిబంధనలు పాటించాలి

- శ్రీభాష్యం శ్రీనివాసాచార్య గురుస్వామి



దీక్షాధారులు నియమ నిబంధనలు పాటించాలి. ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత ముఖ్యం. భక్తిభావన, ఆధ్యాత్మిక చింతన అవసరం. ఇతరులపై ప్రేమ, సోదరభావం, సహనం, గౌరవం, ఆదరాభిమానాలతో మెలగాలి. మన సారా స్వామిని మదిలో నిలుపుకోవాలి.

ఉమ్మడి జిల్లా పీడీఎస్‌యూ కార్యవర్గం

కరీంనగర్ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా లోకిని రమేశ్, కూతాటి రాణాప్రతాప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పీడీఎస్‌యూ నాల్గవ మహాసభల అనంతరం ఉమ్మడి కరీంనగర్ జిల్లా నూతన కమిటీని ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కెంసారపు రవితేజ, అంగడి దేవేందర్, ఎండి అస్లామ్, జిల్లా సహాయ కార్యదర్శిగా మేడొడ్డి అజయ్, బుసారపు దిలీప్, అంగిడి దేవేందర్, జిల్లా కోశాధికారి కొయ్యడ రాకేశ్‌తోపాటు 19 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు పీడీఎస్‌యు జాతీయ నాయకులు పి.మహేశ్, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వి శ్రీకాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేశ్, రాణాప్రతాప్ మాట్లాడుతూ పెండింగ్ ఫీజు రీఎంబర్సుమెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాడుతూ జిల్లాలో పీడీఎస్‌యును మరింత బలోపేతం చేసేందుకు కృషిచేస్తామని ప్రకటించారు. ఈకార్యక్రమంలో జిల్లా కమిటి సభ్యులు మొలుగూరి రాజేశ్, లక్ష్మన్, బొతుకూరి చందు, పొడిశెట్టి అశోక్, కుర్ర అజయ్, సుంకరి హర్షవర్ధన్ పాల్గొన్నారు.

దుకాణాలను తనిఖీ చేసిన పోలీసులు

కొడిమ్యాల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని దుకాణాలను ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం రాత్రి కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు డాగ్ స్క్వాడ్ సహాయంతో తనిఖీ చేసారు. కొడిమ్యాల బస్టాండ్, అంగడిబజార్‌తో పాటుగా ఇతర ప్రధానమైన ప్రదేశాలలో బాంబ్ డిటెక్షన్ టీంతో తనిఖీ చేసారు. కిరాణం దుకాణాలను, టేలాలను ప్రత్యేకంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఎస్సై ఎస్. సందీప్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీ చేసామన్నారు. యువత మత్తు పదార్థాలకు రవాణాను అరికట్టడానికి సహకరించాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని యువతను కోరారు. ఎస్సై వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

శ్రీరాంసాగర్‌లోకి స్వల్పంగా నీరు

జగిత్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం స్వల్పంగా నీరు వస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 1,338 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి సరస్వతీ కాలువ ద్వారా 650 క్యూసెక్కులు, తాగు నీటి అవసరాల కోసం మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 457 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 80.501 టీఎంసీలు కాగా అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉంది. ప్రాజెక్టులోకి ఈ యేడాది జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు 948.168 టీఎంసీల నీరు వచ్చి చేరగా, ప్రాజెక్టు నుంచి 880.455 టీఎంసీల నీరును దిగువకు వదిలారు.

వేములవాడలో భక్తుల రద్దీ

● ఎల్‌ఈడీ స్ర్కీన్‌పై రాజన్న దర్శనం

వేములవాడ టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని ఎల్‌ఈడీ స్ర్కీన్‌పై భక్తులు దర్శించుకున్నారు. శుక్రవారం దాదాపు 10వేలమంది భక్తులు వేములవాడకు తరలివచ్చారు. ఈ సందర్భంగా భీమేశ్వరాలయంలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు కోడెల మొక్కులు చెల్లించి అభిషేకం, అన్నపూజ, కళ్యాణాలు, ఇతర అర్జిత పూజలను నిర్వహించారు. ఎల్.ఇ.డి స్ర్కీన్‌లో రాజన్నను దర్శించుకున్న భక్తులను ఆలయ ఇవో రమాదేవి ఆలయ ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. ఎల్.ఇ.డిలో స్వామివారి దర్శనం ఎలా ఉందని భక్తులను అడిగితే బాగుందని చెప్పారు. అనంతరం బద్దిపోచమ్మ ఆలయంలో అమ్మవారికి భక్తులు బోనం సమర్పించారు.



ఎల్‌ఈడీ స్ర్కీన్‌పై రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

మానకొండూర్‌లో రైతుల రాస్తారోకో

మానకొండూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లోని మార్కెట్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకంలో మోసాన్ని నిరసిస్తూ రైతులు శుక్రవరాం ఆందోళనకు దిగారు. కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. స్థానిక సీఐ సంజీవ్ అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. ఒక్కో బస్తాలో 40.600 కిలోలు తూకం వేయాల్సి ఉండగా నిర్వాహకులు బస్తాకు 43 కిలోల తూకం వేస్తున్నారని రైతులు వివరించారు. దీంతో సంబంధిత అధికారులతో మాట్లాడి నిబంధనల ప్రకారం తూకం వేయాలని సూచించారు. అనంతరం రైతులు రాస్తారోకో విరమించారు.



మానకొండూర్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

సర్పంచ్ పదవి కోసం పెళ్లి

● ఓటరు లిస్టులో పేరు నమోదు కాకపోవడంతో నిరాశ

గంగాధర, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ పదవి చేపట్టి గ్రామానికి సేవ చేయాలనే ఆలోచనలో ఉన్న ఓ యువకుడు హుటాహుటిన పెళ్లి చేసుకున్నాడు. అదే రోజు ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఓటరు లిస్టులో భార్య పేరు నమోదు చేసుకునే వీలు లేకుండా పోయింది. ఎంతో ఆశతో సర్పంచ్‌గా పోటీ చేద్దామని పెళ్లి చేసుకున్న దంపతులకు నిరాశే మిగిలింది. గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ గ్రామం సర్పంచ్ ఎన్నికల్లో ఎస్సీ మహిళకు రిజ్వర్ చేశారు. గ్రామానికి చెందిన అవివాహితుడైన ముచ్చె శంకర్ తనకు అవకాశం లేకపోవడంతో హుటాహుటిన వచ్చిన అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోహెడ మండలానికి చెందిన యువతిని ఈనెల 24న పెళ్లి చేసుకున్నాడు. ఆమెను ఓటరు లిస్టులో చేర్పించి సర్పంచ్‌గా పోటీ చేయించుదామనుకున్నాడు. అదే రోజు సాయంత్రం ఎన్నికల షెడ్యూల్ వచ్చింది. దీంతో శంకర్ భార్య పేరు ఓటరు లిస్టులో చేర్పించే అవకాశం లేకుండా పోయింది. సర్పంచ్‌గా పోటీ చేద్దామనుకున్న ఆ దంపతులకు నిరాశే మిగిందీ.



శంకర్ దంపతుల పెళ్లి ఫొటో

రాష్ట్రస్థాయి చెకుముకి టాలెంట్ టెస్టుకు ఎంపిక

పెగడపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చెకుముకి టాలెంట్ టెస్టు పోటీల్లో పెగడపల్లి మండలంలోని నామాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు మండల విద్యాధికారి సులోచన తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ జనవిజ్ఞాన వేదిక చెక్‌ముకి సైన్స్ సంబరాలు 2025లో భాగంగా శుక్రవారం నిర్వహించిన టాలెంట్ టెస్టులో జిల్లాస్థాయిలో పలు మండలాల నుంచి పాల్గొన్న విద్యార్థులతో పోటీపడి నామాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎం శ్రీవర్ష, ఎ చైత్ర, సీహెచ్ సుస్మిత ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థినులను అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీఈవో రాము అభినందించారు.

కోటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు

● రూ. 2,73,695 ఆదాయం

వెల్గటూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోటిలింగాల కోటేశ్వరస్వామి ఆలయం హుండీని శుక్రవారం లెక్కించారు. కార్తీక మాసం ముగిసిన సందర్భంగా హుండీ లెక్కించగా 2,73,695 రూపాయల ఆదాయం లభించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కాంతారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పూదరి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక మాసంలో స్వామి వారిని దర్శించుకునేందుకు పరిసర గ్రామాల భక్తులతో పాటు, ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు తరలివచ్చినట్లు తెలిపారు. గోదావరి నదిలో పవిత్ర స్నానాలు ఆచరించిన భక్తులు కార్తీక దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారని అన్నారు. కోటేశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్నిచర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రాజా మొగిలి, ధర్మకర్తలు గుమ్ముల వెంకటేష్ బుద్దె రవి, దేవి లావణ్య, అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ, అన్వేష్ శర్మ, భక్తులు, వెల్గటూర్ సేవా బృందం పాల్గొన్నారు.

కోతిని పట్టు.. సర్పంచ్ సీటు కొట్టు

- పంచాయతీ ఎన్నికల్లో 'కోతి' తిప్పలు
- వానరాల బెడద తీర్చినవారికే ఓట్లు
- గ్రామాల్లో తీర్మానాలు



జగిత్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే వారికి కోతులు కొత్త తిప్పలు తెచ్చిపెడుతున్నాయి. గ్రామాల్లో కోతుల బెడద రోజురోజుకు ఎక్కువవుతోంది. దీంతో పలు గ్రామాల్లో కోతుల బెడద తీరిస్తేనే ఓట్లేస్తామంటూ ఓటర్లు అంటున్నారు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా జగిత్యాల జిల్లాలోని పలు గ్రామాల్లో రోడ్లు, మురికి కాలువలు, విద్యుత్, మంచినీరు, పారిశుధ్యం వంటి సమస్యలను పక్కనబెట్టి కోతులను వెల్లగొడతాం.. ఓట్లేయ్యండి అంటూ ఆశావహులు ప్రచారం మొదలు పెడుతున్నారు. పలు గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యుడి స్థానాలకు పోటీచేసే వారు కోతుల సమస్యే ప్రధానంగా ఎజెండాగా ప్రచారంలో దిగుతున్నారు. కోతుల సమస్య తీర్చేవారినే సర్పంచ్‌గా కానీ, వార్డు సభ్యునిగా కానీ గెలిపిస్తామంటూ ఓటర్లు కూడా తెగేసి చెబుతున్నారు. పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీచేసే ఆశావహులు కూడా కోతులను పట్టించే పనులపై దృష్టిపెట్టారు. తమను గెలిపిస్తే కోతుల సమస్యను నివారిస్తామని హామీ ఇస్తున్నారు. పలు గ్రామాల్లో ముందుగానే అనధికార తీర్మానాలు చేసుకుంటున్నారు.

● ఎక్కువయిన దాడులు..

గ్రామాలు, పట్టణాలు అన్న తేడా లేకుండా జగిత్యాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎక్కడ చూసినా కోతుల బెడద ఎక్కువైంది. జిల్లాలో వేల సంఖ్యలో కోతులున్నాయని అంచనా ఉంది. చిన్నా, పెద్ద అన్న తేడా లేకుండా కోతులు దాడులు చేస్తున్నాయి. కోతుల దాడిలో గాయపడటంతో పాటు గుంపుగా దాడి చేయడంతో త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకుంటున్న సంఘటనలూ ఉన్నాయి. సంవత్సరానికి వంద మందికి పైగా గాయపడుతుండగా, చికిత్స కోసం వేల రూపాయల్లో వ్యయం చేస్తున్నారు. పంట పొలాలను ఇష్టారీతిన నాశనం చేసి రైతులకు నష్టాన్ని కలిగిస్తున్నాయి.

● తలకు మించిన భారం..

కోతులను పట్టుకోవడానికి మంకీ క్యాచర్లు ఒక్కో కోతికి వెయ్యి రూపాయల వరకు డిమాండ్ చేస్తున్నారు. అసలే నిధుల కొరత ఉండడంతో చేసేదేమీలేక అధికారులు చేతులెత్తేశారు. దీంతో ఓటర్లు కూడా తమ సమస్య పరిష్కారానికి పంచాయతీ ఎన్నికలే సరయైన దిగా భావిస్తున్నారు. కోతుల సమస్య తీర్చిన వాళ్లకే తమ ఓట్లు వేస్తా మంటూ షరతులు విధిస్తుండడంతో అభ్యర్థులు కూడా ఆ పనిలో పడ్డారు.

కృత్రిమ మేధస్సుపై జాతీయ సదస్సు



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 4, 5 ఫిబ్రవరి 2026న 'భారత ఆర్థిక వ్యవస్థపై కృత్రిమ మేధస్సు ప్రభావం' అనే అంశంపై రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యు.ఉమేష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కన్వీనర్ అర్థశాస్త్ర విభాగాధిపతి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కోడూరి శ్రీవాణి మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థపై కృత్రి మ మేథస్సు ప్రభావం దాని పర్యవసానాలు అనే అంశాలపై మేధావులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు ,పరిశో ధకులు, విద్యార్థులు డిసెంబర్ 30లోపు వ్యాసాలను పంపిం చవచ్చని తెలిపారు. ఉత్తమమైన వ్యాసాలను జర్నల్స్‌లో ప్రచురించనున్నట్లు తెలిపారు.

ముగిసిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

ధర్మారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో మూడు రోజులుగా జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు వేడుకకు హాజరైన జిల్లా విద్యాధికారి శారద జిల్లా యువజన క్రీడ అధికారి ఏ సురేష్‌తోకలిసి విజేతలకు బహుమతులను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలోని 10ఉమ్మడి జిల్లాల నుంచి 244మంది ఈ టోర్నీలో పోటీపడగా లీగ్, సెమీ ఫైనల్స్ అనంతరం ఆరు జట్లు ఫైనల్‌కు చేరాయి. శుక్రవారం ఉదయం జరిగిన ఫైనల్ మ్యాచుల్లో బాలుర విభాగంలో ఖమ్మం జట్టు మొదటిస్థానం సాధించగా, బాలికల విభాగంలో నిజామాబాద్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. బాలుర విభాగంలో రెండో స్థానంలో వరంగల్ జట్టు సాధించగా మూడవస్థానంలో రంగారెడ్డి జట్టు నిలిచింది. బాలికల విభాగంలో రెండవ స్థానం మహబూబ్‌నగర్ జిల్లా జట్టు సాధించగా మూడవ స్థానాన్ని కరీంనగర్ దక్కించుకుంది. పోటీల నిర్వహణకు కృషిచేసిన ఎంఈవో ప్రభాకర్‌ను, టోర్నమెం ట్ ఆర్గనైజర్ బైకని కొమురయ్యను పలువురు అభినందించారు.



విజేతలకు బహుమతుల ప్రదానం

రోడ్డు పనులు చేపట్టాలని రాస్తారోకో

మానకొండూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్-జమ్మికుంట ప్రధాన రహదారి అన్నారంలో నిలిచిపోయిన రోడ్డు పనులను చేపట్టాలని గ్రామస్థులు శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. స్థానిక సీఐ సంజీవ్ అక్కడికి చేరుకొని ఆందోళన విరమింపజేశారు. అనంతరం కాంట్రాక్టర్‌తో మాట్లాడి రోడ్డు పనులు చేపట్టాలని సూచించారు మాజీ సర్పంచ్ పప్పు ఆనంద, మాజీ వార్డు సభ్యుడు మేడి కొండయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర చెస్ జట్టు మేనేజర్‌గా రాజమల్లయ్య

కొడిమ్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్(పీడీ) బూట్ల రాజమల్లయ్యను రాష్ట్ర చెస్ జట్టుకు మేనేజర్‌గా నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి డాక్టర్ ఎ ఉషారాణి ఉత్తర్వులు జారీ చేశారు. త్రిపుర రాష్ట్ర రాజధాని అగర్తలలో ఈ నెల 27నుంచి 30వరకు నిర్వహిస్తున్న 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చెస్ జాతీయ క్రీడల్లో తెలంగాణ రాష్ట్ర బాలికల జట్టుకు మేనేజర్‌గా బాధ్యతలను స్వీకరించారు. శుక్రవారం ఫోన్ ద్వారా రాజమల్లయ్య 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.



రాజమల్లయ్య, పీడీ

ఇసుక ట్రాక్టర్ల సీజ్

కోరుట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పెద్ద వాగు నుంచి ఇసుక అక్రమంగా డంపు చేస్తున్న మూడు ఇసుక బ్లెడ్ ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. స్థానిక వాగులోని బతుమ్మ గాటు సమీపంలో వాగు నుంచి ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. మూడు బ్లేడ్ ట్రాక్టర్లను రెవెన్యూ కార్యాయంకు తరలించి సీజ్ చేసినట్లు ఆర్ఐ శ్రీనివాస్ తెలిపారు. కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కరీంనగర్‌లో..

కరీంనగర్ క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ బస్టాప్ వద్ద అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ గొల్లపల్లికి చెందిన కొత్తూరి కొంరయ్యపై కేసు నమోదు చేశామని, ట్రాక్టర్‌ను సీజ్ చేశామని పేర్కొన్నారు.

దళిత, బహుజనులకు స్ఫూర్తి ప్రదాత జ్యోతిరావు పూలే



ఖనిలో జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు



మంథనిలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

కోల్‌సిటీటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దళిత బహుజనుల, అణగారినవర్గాల స్ఫూర్తిప్రదాత మహాత్మాజ్యోతిరావుపూలే అని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైన రాజేష్, పులిమోహన్ అన్నారు. శుక్రవారం గోదావరిఖని రాజేష్ థియేటర్ సమీపంలో ఉన్న జ్యోతిరావుపూలే విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పూలేను ఆదర్శంగా తీసుకొని నేటితరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బొంకూరి మధు, గొర్రె నర్సింగరావు, యాసర్ల చిరంజీవి, పెరుక రవి, ఎంఏ కరీం, శనిగరం చంద్రశేఖర్, జిలకర రామస్వామి, బొంకూరి పవన్, మురళి, మంతెన సంపత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం అధ్యక్షుడు గట్లరమేష్ ఆధ్వర్యంలో సైతం వర్ధంతికార్యక్రమం నిర్వహించారు. పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రామగిరి: మండలంలోని సెంటినరీకాలనీ మార్కెట్‌చౌరస్తాలో మహాత్మాజ్యోతిరావుపూలే వర్ధంతి శుక్రవారం బీసీనేతలు జరుపుకున్నారు. సెంటినరీకాలనీ టిటూ సెంటర్‌లో పూలేవిగ్రహానికి దండలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు నూనె రాజేశం, చిట్టిమల్లయ్య, చెలుకల జవహర్, రామచందర్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు: మహాత్మా జ్యోతిబాపూలేను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని శివపల్లి, ఎలిగేడులో పూలే వర్ధంతిలో పలువురు నాయకులు, ప్రజలు పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ గోపురమేష్, భాస్కర్‌రెడ్డి, నాయకులు దుగ్యాల సంతోష్‌రావు, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, మండిగ రాజనర్సు, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, తాటిపల్లి రమేష్ బాబు, బాలసాని పర్శరాములు గౌడ్, అమ్ముల రమేష్, రంగు శ్రీనివాస్, పడాల పర్శరాములుగౌడ్, పల్లెర్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం: జ్యోతిరావుపూలే వర్ధంతిని పురస్కరించుకొని గౌతమీబుద్ధ ఫంక్షన్‌హాల్లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సేవాదళ్ జిల్లాఅధ్యక్షుడు బొల్లి స్వామి, ధార మధు, కాంపెల్లి రాజేశం, సుంచు మల్లేశం, ఇరుగురాల రాజనర్సు, సిలుమల రాజ మల్లయ్య, దూడ లచ్చయ్య, గుండా గంగయ్య, మదన్మోహన్, రామగిరి లింగయ్య, ఉప్పులేటి రాజేశం, కాంపెల్లి సతీష్, గాజుల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మంథని: స్థానిక హనుమాన్‌నగర్‌లోని జ్యోతిబా పూలే విగ్రహం వద్ద మాజీఎమ్మెల్యే పుట్ట మధు ఆధ్వర్యంలో వర్ధంతి సభ నిర్వహించారు. స్థానిక మంత్రి క్యాంపుఆఫీసులో పూలే చిత్రపటానికి కాంగ్రెస్‌నేతలు వేర్వేరుగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పూలే ఆశయాలను కొనసాగిస్తామన్నారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో వివిధ పార్టీల నేతలు మాచీడి రాజుగౌడ్, జక్కు రాకేష్, ఏగోళపు శంకర్‌గౌడ్, మిర్యాల ప్రసాద్‌రావు, పెగడ శ్రీనివాస్, పుప్పాల తిరుపతి, మంథని లక్ష్మణ్, జంజర్ల శేఖర్, అడిచర్ల సమ్మయ్య, గోటికార్ కిషన్‌జీ, మంథని సత్యం, ఎరుకల మధు, శ్రీకాంత్, అజీం పాల్గొన్నారు.

ఎన్నికలకు కాసులు ఎట్లా?

(5వ పేజీ తరువాయి)

చాలని బిల్లులను తీసుకువచ్చి గవర్నర్ ఆమోదానికి పంపించారు. అలాగే ఆర్డినెన్స్‌ను సైతం తీసుకువచ్చారు. ఇవి రాష్ట్రపతి ఆమోదం పొందకపోవడంతో బీసీలకు స్థానికసంస్థలు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జీవోలు జారీ చేసింది. ఆ మేరకు రిజర్వేషన్లు ఖరారు చేశారు. సెప్టెంబర్ 27వతేదీన ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ఒకేసారి ముందుగా మండల, జిల్లాపరిషత్ ఎన్నికలతోపాటు ఆతర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేసింది.

● **డైలమాలో అభ్యర్థులు..**

సుప్రీంకోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా ప్రభుత్వం స్థానికసంస్థలు రిజర్వేషన్లు ప్రకటించిందనీ, ఎన్నికల పై స్టే విధించాలని హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన కోర్టు ఆరు వారాల పాటు స్టే విధించి అఫిడవిట్లో దాఖలు చేయాలని అటు.. ప్రభుత్వాన్ని, ఇటు.. పిటిషనర్లను ఆదేశించింది. దీంతో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఒక్కసారిగా డీలా పడ్డారు. ఇప్పట్లో బీసీల రిజర్వేషన్ల అంశం తెగదని భావించారు. వచ్చేఏడాది మార్చి నెలాఖరుతో 15వ ఆర్థికసంఘం గడువు ముగుస్తున్నదని, ఆలోపు స్థానిక ఎన్నికలు నిర్వహించకుంటే రాష్ట్రానికి రావలసిన 3000కోట్ల రూపాయల నిధులు రాకుండా పోతాయని ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు50శాతం రిజర్వేషన్లు మించకుండా ఎన్నికలను నిర్వహిస్తున్నది. సెప్టెంబర్‌లో ఇచ్చిన షెడ్యూల్లో మొదట మండల జిల్లా పరిషత్ ఎన్నికలను నిర్వహించేందుకు షెడ్యూల్ ప్రకటించగా, ఇప్పుడు మాత్రం కేవలం గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణకు మాత్రమే షెడ్యూల్ ఇచ్చింది. దీంతో అకస్మాత్తుగా ఆయాపార్టీలకు చెందిన అభ్యర్థులు ఎన్నికల్లో పోటీచేసే విషయమై డైలమాలో పడ్డారు.

సీఎం, మంత్రులు, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం



ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కళ్యాణ్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో 800మెగావాట్ల థర్మల్ పవర్ విద్యుత్‌కేంద్రానికి ఆమోదించడాన్ని హర్షిస్తూ గోదావరిఖని ట్రాక్టర్స్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్, రామగుండం లారీ యజమానుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ అసోసియేషన్ నాయకుడు దేవేందర్ రెడ్డి, లారీయజమానుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రెండు సంవత్సరాల్లో రామగుండం నియోజకవర్గానికి అనేక నిధులను రాజ్‌ఠాకూర్ తీసుకువచ్చారని, పట్టువదలని విక్రమార్కుడిగా రామగుండంలో 800మెగవాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు కేబినెట్‌లో ఆమోదం పొందే విధంగా రేయింబవళ్లు ఎమ్మెల్యే కృషి చేశారని కొనియాడారు. రామగుండాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళుతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి, మొయినోద్దీన్, రాజేశం, సలీం, రాజిరెడ్డి, ముస్తాఫా, శ్రీనివాస్, అక్బర్, తాజ్, రవీందర్‌రెడ్డి, పోషం పాల్గొన్నారు.

గోదావరిఖని వ్యాపారకూడలిలో సంబరాలు..

కళ్యాణ్‌నగర్: రామగుండంలో విద్యుత్ ప్లాంట్ ఏర్పాటును హర్షిస్తూ శుక్రవారం రాత్రి గోదావరిఖని వ్యాపారకూడలిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తానిపర్తి గోపాల్‌రావు ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండంలో జెన్‌కోస్థానంలో 800మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలుపడం హర్షనీయమని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొంతల రాజేష్, కాల్వ లింగస్వామి, మహంకాళి స్వామి, ముస్తాఫా, పెద్దెల్లి ప్రకాష్, దీటి బాలరాజు, తిరుపతి, గట్ల రమేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

యాసంగి తర్వాత చెక్ డ్యామ్ నిర్మించాలి

● **బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి**



గుంపుల చెక్‌డ్యామ్‌ను పరిశీలిస్తున్న సంజీవరెడ్డి

ఓదెల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎంతో ఉపయోగపడే గుంపుల చెక్‌డ్యామును పేల్చివేశారని, యాసంగి పూర్తి అయ్యేసరికి చెక్‌డ్యామ్ నిర్మాణం చేపట్టాలని బీజేపీజిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం గుంపుల చెక్ డ్యామును బీజేపీ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా సంజీవరెడ్డి గుంపుల డ్యామ్ కూలిపోవడంపై అనుమానాలను వ్యక్తం చేశారు. గతంలో గుంపుల శ్మశాన వాటికను కూల్చివేచేశారని, అలాగే శానగొండ ఊరచెరువు మత్తడిని బాంబులతో పేల్చివేశారని, ప్రస్తుతం గుంపుల చెక్‌డ్యామును కూడా ఇసుకకోసం జిలెటిన్లుపెట్టి పేల్చివేశారని తెలిపారు. గతంలో 57చెక్ డ్యాములపై విజిలెన్స్‌తో విచారణ చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారని, అయితే ఇప్పటివరకు కూడా ఎక్కడా విచారణ చేపట్టలేదన్నారు. చెక్ డ్యామ్ వద్దకు బాంబ్ స్క్వాడ్, ఇంటిలిజెన్స్ అధికారులు వచ్చినా ఇప్పటివరకు నివేదికను బహిర్గతం చేయలేదన్నారు. డ్యామ్‌ను పేల్చివేయడం వల్ల మానేరు పరివాహక ప్రాంతాల్లో దాదాపు నాలుగువేల ఎకరాలకు సాగునీరు అందే పరిస్థితి లేదన్నారు.

వెంటనే పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నల్ల మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కూనారపు రేణుకదేవి, రాగిడి శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్, మాటూరి వెంకట స్వామి, దాత రాకేష్, పుల్ల సదయ్య, చర్లపల్లి రాజు, తొట్ల సతీష్, రమేష్, ఓదెలు, చిరంజీవితో పాటు పలువురు బిజేపి నాయకులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి పనులతో పంటల ధ్వంసం

● **ఆదివారంపేట్ రైతుల ఆవేదన**



దుమ్ము చేరిన పత్తిచేనును చూపుతున్న రైతు

రామగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని ఆదివారంపేట్ మీదుగా చేపడుతున్న జాతీయ రహదారి పనులతో పంటలు ధ్వంసం అవుతున్నాయని గ్రామరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామశివారులోని వ్యవసాయభూములను నాగపూర్-విజయవాడ నేషనల్ హైవే నిర్మాణానికి సేకరించారు. ఆయా పనులు చేపడుతుండగా సామగ్రిని తీసుకువచ్చే భారీ వాహనాలతో రోడ్డుకు ఇరువైపులా పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. పత్తి మొక్కలపై, పగిలిన పత్తికాయలపై దుమ్ము, దూళి చేరడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అతికష్టం మీద ఏరివేతకు వచ్చినా దుమ్ముతో పత్తి రంగు మారడంతో కొనుగోలుదారులు ఆసక్తి చూపడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వపరంగా లేదా ఎన్‌హెచ్ కాంట్రాక్టర్ ద్వారా పంటకు నష్టపరిహారం కల్పించాల్సిందిగా రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కాలువల మరమ్మతులు చేపట్టాలి

మంథని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కన్నాలప్రాజెక్టు కింద బన్నచెరువు, శిలసముద్రం, అయ్యగారి చెరువులకు నీరువచ్చే కాలువ మరమ్మతులను వెంటనే చేపట్టాలని రైతులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రెండేళ్లనుంచి కన్నాల ప్రాజెక్టు కాలువ పూడిక తీయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు.ఇరిగేషన్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదని రైతులు పిల్లి సత్తయ్య, ఐలినర్సయ్య, నరేడ్లబుచ్చన్న, శ్రీనివాస్, శ్రీనివాస్,వెంకన్నఆవేదనవ్యక్తం చేశారు.

గ్రామాల్లో వేడెక్కుతున్న పంచాయతీ పోరు

ఎలిగేడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలతో గ్రామాల్లో రాజకీయ వేడి రాజుకుంటోంది. అనుకూలంగా వచ్చిన రిజర్వేషన్ల మేరకు ఇప్పటికే పదవులను ఆశించే ఆశావహులు గ్రామాల్లో ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. కులపెద్దలను, మహిళలు, యువకులను కలిసి ఎన్నికల్లో అవకాశం కల్పించాలని వేడుకుంటున్నారు. పార్టీ మద్దతుతో పోటీలో ఉంటే గెలుపొందవచ్చనే ధీమాతో ఎవరికి వారే అధినాయకుల వద్ద ఒత్తిడి తీసుకువస్తున్నారు. గ్రామపంచాయతీల్లో పాగా వేసి పట్టు సాదించాలనే లక్ష్యంతో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు కసరత్తు చేస్తున్నాయి. పోటీదారులు ఎక్కువగా ఉండటంతో సంప్రదింపులు, బుజ్జగింపులతో అందరినీ సమన్వయపరిచి గెలిచే అభ్యర్థులను పోటీలో నిలిపేందుకు పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ ఎన్నికల్లో మారిన రిజర్వేషన్లకు అనుగుణంగా కొందరు నాయకులు మహిళాస్థానాల్లో తమ సతులను నిలిపేందుకు ముమ్మర ప్రయత్నాల్లో ఉన్నారు. ఎలిగేడు మండలంలో 12గ్రామపంచాయతీల పరిధిలో మూడో విడతలో భాగంగా డిసెంబర్ 17న ఎన్నికలు జరగనున్నాయి. 12గ్రామపంచాయతీలు 114వార్డు స్థానాలు, 18,570 మంది ఓటర్లు ఉన్నారు.

రెండో రోజు నామినేషన్లు

మంథని/మంథనిరూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో 35గ్రామ పంచాయతీలు ఉండగా వాటిలో రెండోరోజు 65మంది సర్పంచ్ అభ్యర్థులు శుక్రవారం నామినేషన్లు దాఖలు చేశారు. వీటితోపాటు వార్డు స్థానాలకు 82మంది అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలో రెండోరోజు 24గ్రామపంచాయతీల్లో 35మంది సర్పంచ్ నామినేషన్లు, 54మంది వార్డుసభ్యులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో రాంమోహనచారి తెలిపారు.

రామగిరి: మండలంలో రెండురోజుల్లో సర్పంచ్ అభ్యర్థుల నుంచి 32నామినేషన్లు, వార్డు సభ్యుల నుంచి 70నామినేషన్లను స్వీకరించినట్లు ఎంపీడీవో శైలజారాణి తెలిపారు.

ముత్తారం: మండలంలో 5క్లస్టర్ల పరిధిలో 15గ్రామపంచాయతీలకుగాను 30సర్పంచ్, 54వార్డు మెంబర్ నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో సురేష్ తెలిపారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక

సుల్తానాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేరళ మాడల్‌స్కూల్‌కు చెందిన విద్యార్థి చిలువేరి హర్షిత రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు అండర్17 విభాగంలో ఎంపికయ్యాడు. ఈమేరకు శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిద్ధూఎస్ నాయర్, ఉపాధ్యాయులు హర్షిత్‌కు అభినందనలు తెలిపారు.



విశ్రాంతి భవనం ప్రారంభం

గోదావరిఖని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 ఏరియా సివిల్ డిపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన విశ్రాంతి భవనాన్ని శుక్రవారం ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం భవనంలో పలువురు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సివిల్‌డిపార్ట్‌మెంట్‌లో అధికారులు, కాంట్రాక్టర్లు, వివిధ పనుల నిమిత్తం వచ్చే పోయేవారికి ఈ విశ్రాంతి భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. రూ.3.7లక్షలతో భవనాన్ని నిర్మించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం చంద్రశేఖర్, డీజీఎం (సివిల్) వరప్రసాద్, అధికారులు నాగేశ్వరరావు, రవీందర్‌రెడ్డి, వసంత్ కుమార్, హన్మంతరావు, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల సమస్యలపై జీఎంకు వినతి



జీఎంతో మాట్లాడుతున్న అధికారుల సంఘం నాయకులు

గోదావరిఖని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఇండియా(సీఎంఓఏఐ) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బంగ్లాస్‌ఏరియా ఇల్లందుక్లబ్‌లో ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఎంఓఏఐ అధ్యక్షుడు బీ మల్లేష్ మాట్లాడుతూ అధికారుల కాలనీలు శారదనగర్, పవర్‌హౌస్‌కాలనీ, బంగ్లాస్ ఏరియా ప్రాంతం, సెక్టార్-1,-2 క్వార్టర్లలో అంతర్గతరోడ్లు, ఆర్వో ప్లాంటు ఏర్పాటుచేయడం, ఇల్లందు క్లబ్‌లో 2000మంది సామర్థ్యంతో కొత్త ఫంక్షన్ హాల్ నిర్మించాలని కోరారు. అన్ని అధికారుల కాలనీలకు సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని, కంపెనీ తరఫున అధికారిక ప్రతినిధి, యూనియన్లు, ఇతర వ్యక్తులు అధికారులపై చేసే ఏవైనా తప్పుడు ఆరోపణలను ఖండించాలని అన్నారు. తద్వారా ఆరోపణలు వచ్చిన అధికారుల మనోధైర్యాన్ని పెంచాలి అని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం చంద్రశేఖర్, ఏరియా సీఎంఓఏఐ సెక్రెటరీ మల్లేష్, వైస్‌ప్రెసిడెంట్ పెరుమల్ల శ్రీనివాస్, అధికారులు ఆంజనేయులు, వర ప్రసాద్, జితేందర్ సింగ్, ఏసీఎంవో అంబిక, ధనలక్ష్మి బాయి, రవీందర్‌రెడ్డి, వేణు, శ్రావణ్‌కుమార్, హన్మంతరావు, రావుల దామోదర్, తోట అంజయ్య, క్రాంతి, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

రామగుండం ప్రజల కల నెరవేరింది



ముఖ్యమంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రామగుండం ప్రజల చిరకాల కల నెరవేరిందని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. జెన్‌కో స్థానంలో 800మెగావాట్ల థర్మల్ పవర్‌ప్రాజెక్టు రావడం హర్షనీయమని ఆయన అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అజారుద్దీన్‌తో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రామగుండంలో మూతపడిన జెన్‌కో పవర్‌ప్లాంట్ స్థానంలో 800మెగావాట్ల విద్యుత్‌ప్లాంట్‌కు కేబినెట్‌లో ఆమోదం తెలుపడంపై వారికి కృతజ్ఞతలు తెలిపారు. రామగుండం నియోజకవర్గంలో ఒక్కొక్కటిగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్టు, రూ.700కోట్లతో రామగుండం కార్పొరేషన్‌తోపాటు మండలాల్లో ప్రజలకు మౌలిక వసతులు, రోడ్లు, డ్రైనేజీలు, మంచినీరు, విద్యుత్ దీపాలు వంటి పనులతోపాటు ట్రాఫిక్ ఐలాండ్ నిర్మాణాలు చేపడుతున్నట్టు తెలిపారు. రామగుండాన్ని సుందరీకరణ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. 800మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ నిర్మాణం పూర్తయితే స్థానిక యువతకు ఉపాధి మెరుగుపడి మరిన్ని నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల స్థూపాన్ని సంరక్షించాలి



విలేకరులతో మాట్లాడుతున్న వారసుల సంఘం సభ్యులు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిలోని పాత ఎంపీడీవో కార్యాలయంలో స్థాపించిన స్వాతంత్ర్య సమరయోధుల స్థూపాన్ని సంరక్షించాలని స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం పెద్దపల్లి అధ్యక్షుడు బాలసాని వెంకటేశం కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 25ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా 1972 ఆగస్టు15 నుంచి 1973ఆగస్టు14 వరకు దేశవ్యాప్తంగా సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలలో భాగంగా పెద్దపల్లిలో నాటి పంచాయతీసమితి నేటి ఎంపీడీవో కార్యాలయంలో త్రిభాషలో ప్రచురిస్తూ స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి చిహ్నంగా స్థూపం ఏర్పాటు చేసిందన్నారు. ప్రస్తుతం ఇక్కడ ఆర్టీసీ డిపోకు ప్రభుత్వం కేటాయించడంతో ఆ స్థూపం చుట్టూ ఉన్న కాంపౌండ్‌ను తొలగించారని అన్నారు. దానికి భద్రతకల్పిస్తూ సురక్షితమైన ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లావారసుల సంఘం ప్రధాన కార్యదర్శి కోలవెంకటేశ్వర్‌రావు, కోశాధికారి వెలగందుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

పెద్దపల్లి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలన మన అందరి బాధ్యత అని జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త దయా అరుణ అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దకల్వలలోని మజీద్ ఆవరణలో మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. 18ఏళ్లలోపు ఆడపిల్లలకు 21ఏళ్లలోపు మగపిల్లలకు వివాహాలు చేయటం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహనికి అనుమతినిచ్చిన, వివాహాన్ని నిర్వహించినా, జరగడానికి సహకరించినా, బాల్య వివాహనికి హాజరైనా వారందరూ నిందితులుగానే పరిగణించబడతారన్నారు. కార్యక్రమంలో సుచరిత, సమత, మోహిన్, రహీం, అబ్దుల్ మాలిక్, అబ్దుల్ మతిన్, సయ్యద్, నజీర్ పాల్గొన్నారు.

మందు బాబులతో వేగలేకపోతున్నాం



ప్రెస్‌మీట్‌లో గోడు వెల్లబోసుకుంటున్న బాధితులు

ధర్మారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మందుబాబులతో వేగలేకపోతున్నాం.. అధికారులు మా బాధలు అర్థం చేస్కోండంటూ గాంధీచౌక్ వద్ద వైన్స్ నిర్వాహనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి తమగోడు వెల్లబోసుకున్నారు. వైన్స్ వల్ల తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. తమ ఇళ్ల ముందు వెహికిల్స్ పెట్టుకొని మద్యం తాగుతూ తమనే బెదిరిస్తున్నారని వైన్స్ పక్క ఇంటి యజమాని మిట్టపల్లి చంద్రకాంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వైన్స్ పక్కనే సిటింగ్ పాయింట్ ఉండడం వల్ల అక్కడే తాగుతూ, మల మూత్రాలు చేస్తూ రాత్రి వరకు మందుబాబులు వీరంగం సృష్టిస్తున్నారని అన్నారు. మహిళలు బయటకు రావలంటే భయభ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. వైన్స్‌ను జనావాసాలకు దూరంగా తరలించాలని ఇప్పటికే మంత్రి అడ్లూరితోపాటు కలెక్టర్, సంబంధిత అధికారులకు ఫిర్యాదుచేశామని పేర్కొన్నారు. అయినప్పటికీ స్పందన లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జనావాసాలకు దూరంగా వైన్స్‌ను తరలించి తమ కుటుంబాలకు న్యాయం చేయాలని వేడుకున్నారు. కార్యక్రమంలో దూడలచ్చయ్య, చిలుముల రాజమల్లయ్యతదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు పరిశీలన

పాలకుర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని పాలకుర్తి, బసంత్‌నగర్, కుర్మపల్లి వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం పెద్దపల్లి జిల్లా అదనపుకలెక్టర్ వేణు పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా త్వరగా కొనుగోళ్లు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు.

కాంగ్రెస్ పాలనలోనే రామగుండం అభివృద్ధి

● **జిల్లా మహిళ కాంగ్రెస్ మాజీఅధ్యక్షురాలు కొలిపాక సుజాత**

జ్యోతినగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలోనే రామగుండం సంపూర్ణంగా అభివృద్ధి చెందుతోందని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, మాజీ కార్పొరేటర్ కొలిపాక సుజాత అన్నారు. శుక్రవారం ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు వద్ద ఆమె ఆధ్వర్యంలో బణాసంచాలు కాల్చి, మిఠాయిలను పంచుకుని సంబరాలుచేసుకున్నారు. రామగుండం ఎమ్మెల్యే ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు రామగుండం జెన్‌కో ప్రాంతంలో 800మెగావాట్ల విద్యుత్‌ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులు రావడం, ఎమ్మెల్యే కృషి, పట్టుదలకు నిదర్శమన్నారు. ఈప్రాజెక్టుకు అనుమతిచ్చిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తూం పద్మ, వనజ, సంజీత పాల్గొన్నారు.

జర్నలిస్టులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

మార్కండేయకాలనీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని టీయూడబ్ల్యూజేఏ జిల్లా అధ్యక్షుడు ఎం వంశీ, గోదావరిఖని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పూదరికుమార్ అన్నారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఉచితమెగావైద్యశిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఒత్తిళ్లమధ్య వృత్తిని కొనసాగించే జర్నలిస్టులు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు శ్యాంసుందర్, శ్యామ్‌కుమార్, కోల లక్ష్మణ్, అలంకి లచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.